
# అమ్మ చుక్కమ్మ

వి. వాణీప్రసాద్



కన్నయ్యా!

నిన్ను చూసి చాలా రోజులయింది. నువ్వు వస్తావని, కనీసం ఉత్తరమైనా రాస్తావని ఎన్నో రోజులనుంచి ఎదురుచూస్తున్నాను. నువ్వు బాగా చదువుకుంటు న్నావా? డబ్బుకు ఇబ్బంది పడకు. అవసరమైతే వెంటనే రాయి.

ఇట్లు
నీ కోసం ఎదురు చూసే
అమ్మ- చుక్కమ్మ

"ఇంతేనా, చుక్కమ్మా!"- చదివి వినిపించాడు, పోస్టుమాన్ రంగారావు. "అంతే, బాబు. అంతే; నీ కడుపు చల్లగ. నీ ఆసరే లేకుంటే నాకు దరీ దిక్కు తోచేది కాదనుకో"- కృతజ్ఞతతో అంది చుక్కమ్మ. లోపలి

కెళ్ళి డబ్బుతెచ్చి, కొడుకుకు మనియార్డర్ చెయమని అందించింది. "దాన్దేముందిలే చుక్కమ్మా! ఇదేమంత పెద్దసాయమని?" అంటూ చుక్కమ్మ అందించిన డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు రంగారావు.

చుక్కమ్మకు కడుపున పుట్టిన కొడుకు కాదు కన్నయ్య. భగవంతుడు ఇచ్చిన వరంగా భావించుకుంటుంది చుక్కమ్మ కన్నయ్యను. పెండ్లి అయి పది సంవత్సరాల యినా సంతానం కలగలేదు. చుక్కమ్మ చంద్రయ్యలకు. చుక్కమ్మ తోటి ఎన్నో నాటు మందులు వాడించాడు చంద్రయ్య. కలగని పిల్లల కోసం ముఖం వాచి బోనాలు ఎత్తింది.

జాగరణలు చేసింది. మొక్కులు మొక్కింది. తాయత్తులు కట్టించుకుంది చుక్కమ్మ. ఇటువంటి ప్రయత్నాలతో విసిగి కొంతమంది సలహాననుసరించి చుక్కమ్మను పట్నంలో పేరుపడిన లేడీ డాక్టరుకు చూపించాడు చంద్రయ్య.

చుక్కమ్మ గర్భం ధరించే అవకాశమే లేదని తేల్చి చెప్పివేసింది లేడీ డాక్టరు.

హతాశులయి పుట్టెడు దిగులును గుండెల్లో పేర్చుకుని, వాడిపోయిన ముఖాలతో ఇంటికి చేరుకున్నారా దంపతులు.

భార్య మీద మమతతో మరో మనువు చేసుకోవటానికి మనన్కరించలేదు చంద్రయ్యకు.

కాని.....తన ఇంట పిల్లవాని ఏడుపు వినాలని, దోగాడే పసివాడు కావాలని, తన రక్తమైన ఆ బిడ్డను తన భుజాల మీద కెక్కించుకుని సంబరపడాలని... తన ఇల్లు నిలబెట్టుకోవాలనే ఆశ, తపన అతనిలో చావలేదు.

అందుకే... కేవలం అందుకే తనంటే ఇష్టపడిన మరో స్త్రీతో బిడ్డను కని తనకిచ్చే ఒప్పందంపై సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కన్న బిడ్డను... పట్నానికి జట్కా బండి బాడుగకు వెళ్తుంటే దారిలో దొరికాడని, ఏ అమ్మ కన్న బిడ్డో పాపం... మనకెట్టాగూ పిల్లలు లేరుగా... ఈదేవుడిచ్చిన బిడ్డ... సాక్కుందాం. అని ఆ బిడ్డను చుక్కమ్మ ఒడిలో ఉంచాడు చంద్రయ్య.

భర్త తనను మభ్య పెట్టిన పద్ధతికి నవ్వుకుంది చుక్కమ్మ. తనపై ఆపేక్ష లేనివాడే అయితే: ఏనాడో మరో మనువాడేవాడు. బిడ్డల పట్ల గల కోరిక తననిలా పురికొల్పింది... అన్న వాస్తవాన్ని అర్థం చేసుకున్న చుక్కమ్మ ఆ బిడ్డను, తన భర్త బిడ్డను తన బిడ్డగానే గుండెల కదుముకుంది, గుండెల్లో పొదువుకుంది.

ఓ తల్లి అందివ్వగల మమతా మాధుర్యాలను దోసిళ్ళతో హృదయపూర్వకంగా అందించింది చుక్కమ్మ. ఆ తల్లి గుండెల మీదనే పెరిగాడు కన్నయ్య. కన్నయ్యను 'తమకన్ను'గా 'కన్నయ్య'గానే పెంచుకుంటున్నారా దంపతులు.

వారు ఆ సంతోషాన్ని సంపూర్ణంగా పంచుకోకుండానే, తమ కొడుకు కోసం ఫలహారాలు పొట్లాలు కట్టించుకుని, బాడుగలు తోలుకున్నాక, పట్నంనుంచి మునిమాపువేళ ఇంటిదారిని పట్టిన చంద్రయ్య జట్కా బండిని ఊరి మొగల్లో లారీ గుద్దుకుంది.

గుర్రం చచ్చిపోయింది. బండి విరిగిపోయింది. చంద్రయ్య రక్తంలో దొర్లాడు. ఆ ఘోరాన్ని చూసిన కొందరు చుక్కమ్మ దగ్గరికి పరుగెత్తితే, మరికొందరు



"మీరేదో నిఘంటువు రాస్తున్నారట కదా?" అడిగాడు మాణిక్యాలరావు.

"అవును. 'బూతు పదకోశము' అనే నిఘంటువు రాస్తున్నాను - తెలుగు సినిమా కవులకు ఉపయోగపడుతుంది...!" చెప్పాడు బూతూరి.

- రాయవరపు రవి, రామాయంపేట

చంద్రయ్యను హాస్పటల్‌కు తరలించే ప్రయత్నంలో పడ్డారు. తెలివైన కొందరు లారీ డ్రైవర్ జాడ కానరాకపోతే, లారీ నంబరును రాసుకున్నారు.

ఘొల్లుమంది చుక్కమ్మ. కన్నయ్య చెయ్యందుకుని చంద్రయ్య కోసం పరుగులు పెట్టింది. చుక్కమ్మ స్పర్శతో చంద్రయ్య కొన ప్రాణం మెరిసింది. మాట కూడదీసుకుని హృదయాన్ని చిక్కబట్టుకొని "చుక్కీ... నిన్ను మోసం చేశానే... కన్నయ్య నా కొడుకేనే... శమించవే... ఆడిని మంచిగ...." ఆ తర్వాత మాట్లాడలేకపోయాడు చంద్రయ్య.

"నా కెరికే మావా! నీవు రంది పడకు. నీ కొడుకు నా కొడుకు గాదా?" అంటూ చంద్రయ్య చేతుల్లో ముఖం దాచుకుంది. చుక్కమ్మ. 'నువ్వు దేవతవే'- అని చుక్కమ్మ మంచి మనసుకు మనసులోనే దండం పెట్టుకుంటూ కన్ను మూశాడు చంద్రయ్య.

ఆనాటి నుంచి ఈనాటి వరకు బ్రతుకు బాటలో...జీవన పయనంలో... కన్నయ్య పెంపకంలో ఎన్ని కష్టాలనో, ఎదుర్కొంది చుక్కమ్మ. కొద్దో, గొప్పో మిగిలిన డబ్బును కన్నయ్య పేరనే బ్యాంకులో వేయించింది.

కూలికే పోయిందో, నాలికేపోయిందో, భర్త కిచ్చిన మాటను నిలబెట్టుకోవటం కోసం, భర్త పట్ల ప్రేమను... కన్నయ్య పెంపకంలో సాధించవలసిన గమ్యంగా నిలుపుకుని కన్నయ్య ఆగడాన్ని సహించింది. పెరుగుతూ పెంచుకోవలసిన బుద్ధిని కాకుండా, చెడుసావాసాల కలవాటు పడుతున్న కన్నయ్యను మందలించబోయి భంగపాటు చెందింది చుక్కమ్మ.



"అదేమిటే నిద్రలో ఉలిక్కిపడి లేచావు?" ఆందోళనగా ప్రశ్నించింది గాయిత్రి.

"దూరదర్శన్ అనౌన్సర్లు కలలోకి వచ్చారే" భయం భయంగా చెప్పింది శ్రీలత.

- రాయవరపు రవి, రామాయంపేట

ఆ అవమానాన్ని దు:ఖాన్ని కడుపులో దాచుకుని కన్నయ్యను కూడా కడుపులో దాచుకుంది.

ఉన్న వూరిలో చదువు ఏదోలా వెలగబెడితే, పట్నం హాస్టలులో చేర్పించి, బుద్ధిగా వుండమని వేడుకుంది ఆ తల్లి.

కడుపు కట్టుకుని, పైసలు కూడబెట్టి, కన్నయ్యకు యిబ్బంది కలుగకుండ, నెలనెలా పోస్టుమాన్ రంగారావు సాయంతో డబ్బు పంపుతుంది.

కాని పెంచిన మమతతో... పెంచుకున్న ఆశతో... వాడిని చూడాలని... వాడి అభివృద్ధిని కళ్ళతో చూసుకోవాలని తపిస్తుంది చుక్కమ్మ మనస్సు.

ఒకసారి పట్నంలో బ్రాకెట్ ఆడుతున్న కన్నయ్యను చూసి "కన్నయ్యా! ఇదేం పని?... అక్కడ మీ అమ్మ కష్టాలుపడి... నువ్వేదో చదువుకుని బాగుపడతావని డబ్బు పంపిస్తుంటే... నువ్విక్కడ చిల్లర వేషాలు వేస్తావా?" అని మందలిస్తే... "అది నాకు తల్లా? దాని పైసలు అణా పైసలుతో సహా యిచ్చేస్తాను." అన్న కన్నయ్య పెడసరపు సమాధానానికి బిత్తరపోయాడు రంగారావు. ఆ మూర్ఖుడికిక చెప్పేదేమీ లేదని వెనుదిరిగాడు.

ఆనాటి నుంచి చుక్కమ్మ మనశ్శాంతి కోసరం మాత్రమే కన్నయ్యకు ఉత్తరం వ్రాస్తాడు రంగారావు. వాస్తవం చెపితే ఆ తల్లి గుండె ముక్కలవుతుందని అతనికి తెలుసు. "ఎందుకు రుక్కమ్మా! యింత కష్టపడి పైసలు పంపకపోతేనేమి?" అంటే... "అట్ట గనకుబాబూ! ఆడే నా జీయితం...చంద్రత్త పోయాక ఆడికోసమే నా బతుకు. వాడు ఆడ డబ్బు కిబ్బంది పడుతూ ఏం సదువుతాడు??" అన్న చుక్కమ్మ సమాధానానికి కళ్ళు చెమర్చేవి రంగారావుకు.

ఆ తల్లి ఇచ్చిన పైసలు కన్నయ్యకు పంపి వృధా చెయ్యదలుచుకోలేదు; రంగారావు.

చుక్కమ్మ పేరుతో వాటిని పోస్టాఫీసులో జమ చేశాడు. ఇవేమీ తెలియదు చుక్కమ్మకు. ఆమెకు తెలిసినవి, కావలసినవి రెండే... తన కకకన్నయ్య డబ్బుకిబ్బంది పడకూడదు. చదువుకుని పైకి రావాలి.. అంతే..

ఇంకా కొంతమంది వూరివాళ్ళు పట్నం పోతూ, వస్తూ కన్నయ్య వ్యవహారం కనిపెట్టినా, వాస్తవాన్ని చుక్కమ్మకు తెలియపరిచి, ఆమె మనసును గాయపర్చడం యిష్టం లేక మౌనంగా వుండిపోయారు.

ఎలాగైనా సరే; కన్నయ్యను చూడాలనే తాపత్రయంతో కన్నయ్య కిష్టమైన జంతికలు పొట్లం కట్టుకుని పట్నం వెళ్ళింది చుక్కమ్మ.

కన్నయ్యను చేర్చిన కాలేజీలోను, హాస్టలులోను వాకబు చేస్తే; ఆ కన్నయ్య, తన కన్నయ్య ఏనాడో చదువు మానేసాడని తెలుసుకుని హతాశురాలయింది. ఎక్కడుంటాడో కూడా ఎవరూ తెలియదన్నారు.

నిస్సత్తువను, నిరాశను, దిగులును వెంటబెట్టుకుని గంపెడు చీకట్లో వూరికి చేరుకుంది చుక్కమ్మ.

ఆనాటి నుంచి కొడుకును గురించి మనసులో పేరుకున్న బెంగ, చూడలేకపోతున్నాననే దిగులు, అసలు ఏ దారిలో వాడి బ్రతుకు నడుస్తున్నదో అనే ఆవేదన, ఆరాటం ఆమెను కృంగ దీశాయి. ముదురుతున్న వయసు ఆమెను అనారోగ్యంపాలు చేసాయి.

